## మర్యాదపూర్వకంగా..



బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును బుధవారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న కాంగ్రెస్ పాలన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. – చిక్కడపల్లి, ఫిబ్రవరి 12

## హాకథాన్ హాక్త్రానిక్స్‌లో ఈసీఈ ఎంజీఐటీ విద్యార్థుల ప్రతిభ



హాక్త్రానిక్స్‌లో ప్రతిభకనపర్చిన ఎంజీఐటీ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమోహన్ రెడ్డి

మణికొండ, ఫిబ్రవరి 12: విద్యార్థులు కష్టపడి చదువుతూ ఎప్పటికప్పుడు తమ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే విజయాలు వాటంతటా అవే వరిస్తాయని ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఘట్కేసర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 24 గంటల జాతీయ స్థాయి 'హాకథాన్ హాక్త్రానిక్స్–2025'లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వీఎల్ఎస్ఐ విభాగంలో కె.వెంకటశ్రీరామ్, అనూప్ డోరెపల్లి, శ్రీహర్ష ఆధ్వర్యంలోని విద్యార్థుల బృందం ప్రథమ బహుమతిని, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగంలో సాత్విక్ వర్ధన్, సాహిత్, ఆనంద తీర్థ, సాన్వి విద్యార్థి బృందం ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు వందలకు పైగా విద్యార్థి బృందాలు పాల్గొన్న ఈ హ్యాకతాన్‌లో కళాశాల ఈసీఈ విభాగానికి చెందిన ఐఈటీఈ స్టూడెంట్ ఫోరమ్ విద్యార్థులు ఐదు బృందాలుగా ఏర్పడి వివిధ విభాగాల్లో పాల్గొని విజయం సాధించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఈసీఈ ఎంజీఐటీ విద్యార్థుల ఈ గణనీయమైన విజయాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.సుధాకర్ రెడ్డి గారు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్పీ సింగ్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ వెంకటరెడ్డి, మెంటార్ ఎ.బాలరాజు, ఆధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు



మింట్ కాంపౌండ్ కార్యాలయంలో ఉత్సవాల్లో పాల్గొన్న కార్మికులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారం మింట్‌కాంపౌండ్‌లోని ఆ సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మెజార్టీ యూనియన్‌గా కార్మికుల మన్ననలను పొందుతున్న 1104 యూనియన్ భవిష్యత్‌లోనూ ఇదే విధంగా కార్మికుల కోసం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు మాట్లాడుతూ.. విద్యుత్ రంగ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి 75 ఏండ్ల కిందట ఈ యూనియన్ ఏర్పాటైందని, అప్పటి నుంచి ఇప్పటివరకు యూనియన్ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్లాటినం జూబ్లీ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్, మండల, డివిజన్, జిల్లా, ట్రాన్స్‌కో, జెన్‌కో స్థాయిలో ఘనంగా జరుగుతున్నాయని, తమ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేదని, కేవలం కార్మికులు, ఉద్యోగుల పరిష్కారం కోసమే యూనియన్ పనిచేస్తున్నదని చెప్పారు. ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన యూనియన్ నాయకులను సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

## ముగిసిన డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్' పేరుతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన నేచర్ గైడ్ ట్రైనింగ్ ప్రోగ్రాం బుధవారం ముగిసింది. ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు చెందిన 25 మంది ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. జంగిల్ సఫారీ ద్వారా అటవీ జంతువులను ప్రత్యక్షంగా వీక్షించడంతోపాటు పర్యావరణానికి హాని కలుగకుండా ట్రెక్కింగ్ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చామని తెలంగాణా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం వి.తనూజ, ప్లాంటేషన్ మానేజర్ లక్ష్మారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. – శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 12



డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ కార్యక్రమంలో శిక్షణ తరగతులు

# ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి..

**నగరంలో 10 రోజులుగా పెరిగిన పీఎం స్థాయిలు**

**గాలి నాణ్యత సూచిలో దిగజారిన నగరం**



సిటీ బ్యూరో, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): భాగ్యనగరంలో కాలుష్య స్థాయిలు మళ్లీ పెరిగిపోతున్నాయి. గత 10 రోజుల నుంచి స్థాయిలకు మించి కాలుష్యం వెలువడుతున్నది. దేశంలో కోల్‌కతాలో అత్యధికంగా కాలుష్య తీవ్రత 155 నమోదు కాగా, గాలి నాణ్యత సూచికలో 128 నమోదై మూడో స్థానంలో ఉండటం ఆందోళనను కలిగిస్తున్నది. గాలిలో సూక్ష్మ, ద్రవరూపంలో ఉండే కణ పదార్థాన్ని(పీఎం) రెండు విభాగాలుగా విభజించారు. అందులో పది మైక్రోకణాలకంటే తక్కువ ఉంటే పీఎం 10 అంటారు. రెండో రకం పీఎం 2.5. ఇవి ప్రధానంగా ఊపిరితిత్తుల సమస్యకు, శ్వాసకోశ సమస్యలకు కారణమవుతాయి. వీటి స్థాయిలు ఈ నెలలో క్రమంగా మారుతున్నాయి. గాలి నాణ్యత సూచికలో 0–50 వరకు అనుకూలమైనదిగా, 51–100 వరకు ఓ మోస్తరుగా, 101–200 వరకు బలహీనంగా పేర్కొంటారు. 201–300 అధిక కాలుష్యంగా, 301–400 అత్యంత హానికం, 401–500 అత్యంత ప్రమాదకరంగా సూచికలో తెలియజేస్తారు. కాగా, ఈనెల ఒకటి నుంచి 8వ తేదీ వరకు కాలుష్య తీవ్రత పెరిగినట్లుగా గాలి నాణ్యత సూచీలు తెలియజేస్తున్నాయి. నగరంలో ఫిబ్రవరి 1న 112, ఫిబ్రవరి 2న 104, ఫిబ్రవరి 3న 102, ఫిబ్రవరి 4న 108, ఫిబ్రవరి 5న 108, ఫిబ్రవరి 6న 106, ఫిబ్రవరి 7న 125, ఫిబ్రవరి 8న 124, ఫిబ్రవరి 9న 131, ఫిబ్రవరి10న 132, ఫిబ్రవరి11న 127 గా నమోదైంది.

**కట్టడి సాధ్యమేనా..**

నిత్యం పెరుగుతున్న వాహనాలు వాటి నుంచి వెలువడే పొగ కారణంగానే అత్యధిక శాతం కాలుష్యం ఏర్పడుతున్నది. రవాణాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 82,45,304 వాహనాలు ఉండగా, అందులో 58,71,539 ద్విచక్ర వాహనాలు, 15లక్షల కార్లు ఉన్నట్లు సమాచారం. ఆవే కాకుండా వేల సంఖ్యలో పరిమితి దాటిన వాహనాలు పట్టణంలో రోడ్లపైకొస్తున్నాయి. వాటి నుంచి వెలువడే పొగ తీవ్రత సైతం కాలుష్యానికి కారణమువుతుంది. నిత్యం పెరుగుతున్న కాలుష్య తీవ్రతను నివారించాలంటే ప్రతి చిన్న పనికి వాహనాలు వాడకుండా నడకమార్గాన్ని ఎంచుకోవాలంటూ పలువురు వైద్యులు సూచనలిస్తుండటం విశేషం.

## కొత్త పీఆర్సీ వేయండి

**పెండింగ్ డీఏలను చెల్లించండి**

**పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయండి**

**ప్రభుత్వానికి టీఎన్జీవో వినతి**

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 12: ఉద్యోగుల సమస్యలు తీర్చే దిశగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కొత్త పీఆర్సీని నియమించి మెరుగైన స్కేళ్లను నిర్ధారించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష. కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాంపల్లి లోని టీ ఎన్జీవో భవన్లో తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావులతో కలిసి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను, అలాగే పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ మేరకు హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్సీని ఏర్పాటు చేసి మెరుగైన ఫిట్మెంట్ ఇస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొత్తం 50 సమస్యల్లో ఆర్థిక భారం లేనివి 40 వరకు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన న్యూడెమోక్రసీ అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వరరావు

## కాంగ్రెస్ 420 హామీలు ఏవీ?

**చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన న్యూడెమోక్రసీ**

ముషీరాబాద్, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం విద్యానగర్లోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో చలో హైదరాబాద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ఇచ్చిందన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. రైతులకు ఇస్తానన్న రూ.12 వేలు మరిచిపోయిందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా బస్సులను తగ్గించి తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇస్తానన్న పెన్షన్ గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఫిబ్రవరి 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్ జి.ఝాన్సీ, అరుణ, అనురాధ, మహేశ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేత**

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 12 : బంజారా(లంబాడీల) ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్‌జయంతికి ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించాలని కోరుతూ బుధవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్లు లంబాడీల(బంజారా) ఐక్యవేదిక(లైవ్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించి జయంతికి సెలవు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు బోడ భద్రు నాయక్, లైవ్ ముఖ్య సమన్వయకర్త గుగులోత్ రమేశ్ జాదవ్, విభాగం కన్వీనర్ రాందాస్ నాయక్, రాష్ట్ర ఆర్గనైజర్ కన్వీనర్ గుగులోత్ ప్రవీణ్ నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి

**దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ**



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న తెలంగాణ దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ, కార్యవర్గ సభ్యులు, సంఘం అర్చకులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): హిందూ ధర్మ పరిరక్షణలో ముందుండి నడిపించేది ఆలయ అర్చకుడు మాత్రమేనని తెలంగాణ దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ అన్నారు. బుధవారం చిలుకూరు బాలాజీ దేవస్థాన ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను తెలంగాణ దూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆయా జిల్లాల సంఘాలకు చెందిన అర్చకులు కలిసి జరిగిన దాడిని ఖండించారు. వాసుదేవశర్మ మాట్లాడుతూ.. యావత్ హిందూ దేవాలయాల్లో పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులపై జరిగిన దాడిగా భావించి తక్షణమే దుండగులను శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రిస్వామి, అన్నవర్జుల ప్రసాద్‌శర్మ, భార్గవాచార్యులు, జయతీర్థ చార్యులు, లక్ష్మీ కాంతాచార్యులు, వేగ్గళం సంతోష్ శాస్త్రి, పాడిమెట్ల శివప్రసాద్, కూర్మచలం శ్రీనివాస్, గాజుల మొండయ్య, జంగం మహేశ్, రవికుమార్ పాల్గొన్నారు.



రంగరాజన్‌ను కలిసి సన్మానిస్తున్న విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాంసింగ్, డాక్టర్ సునీతారెడ్డి, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి

## రంగరాజన్‌పై దాడి చేసిన వారిని క్షమించం

**విశ్వ హిందూ పరిషత్**

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 12: చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడికి పాల్పడిన ధర్మ ద్రోహులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. రాముడిని అడ్డం పెట్టుకొని ధర్మంపై దాడి చేస్తే ఊరుకునేదిలేదని తీవ్రస్థాయిలో హెచ్చరించింది. బుధవారం విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రతినిధి బృందం వెళ్లి చిలుకూరులో రంగరాజన్‌ను పరామర్శించారు. ఆయనకు విశ్వ హిందూ పరిషత్ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ధర్మం ముసుగులో కొంత మంది హిందుత్వాన్ని అభాసుపాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని.. దీనిని యావత్ హిందూ సమాజం తీవ్రంగా పరిగణించాలని సూచించారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ సునీత రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకట్‌రెడ్డి, ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ శ్రీమతి పద్మశ్రీ, దుర్గా వాహిని రాష్ట్ర కన్వీనర్ శ్రీమతి వాణి సక్కుబాయి, డాక్టర్ ప్రేమలత, అనంతగిరి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ రంగనాథ్, నాయకులు నంద కిశోర్, మధుసూదన్ రెడ్డి, హరినాథ్, రంగరాజన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## వ్యాధులను గుర్తించే లాంజ్విటీ లాంజ్

**ఒమెగాలో సేవలు ప్రారంభం**



విలేకరుల సమావేశంలో వివరాలు తెలుపుతున్న డాక్టర్ మోహన వంశీ

కొండాపూర్, ఫిబ్రవరి 12: క్యాన్సర్‌తోపాటు కార్డియాక్, బ్రెయిన్ స్ట్రోక్, సంతానోత్పత్తి వంటి ప్రాణాంతక, అతి తీవ్ర వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు, వ్యాధికి తగిన చికిత్సను అందించేందుకు వీలుగా రూపొందించిన లాంజ్విటీ లాంజ్‌ను బుధవారం గచ్చిబౌలిలోని ఒమెగా దవాఖానలో ప్రారంభించారు. దీనిలో భాగంగా ఒమెగా దవాఖాన వ్యవస్థాపకులు డాక్టర్ మోహనవంశీ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి రోజురోజుకు పెరిగిపోతుందని, ఏటా వ్యాధిబారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కేవలం క్యాన్సర్ వ్యాధి కాకుండా బ్రెయిన్ స్ట్రోక్, కార్డియాక్ అరెస్ట్, సంతానలేమి సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఇలాంటి సమస్యలను ముందస్తుగానే గుర్తించి తగిన చికిత్సను అందించడం ద్వారా వ్యాధిబారిన పడకుండా ఉంటుందన్నారు. జన్యుపరమైన పరీక్షల ద్వారా కొన్ని నెలల ముందుగానే రాబోయే వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన చికిత్సను అందించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాంటి చికిత్స కొరకు దేశంలోనే మొదటిసారిగా లాంజ్విటీలాంజ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. అత్యధిక టెక్నాలజీ ద్వారా కేవలం మనిషి ఉమ్మి ద్వారా జన్యుపరమైన పరీక్షల నిర్వహించి భవిష్యత్తులో ఎదుర్కోబోయే ఆరోగ్య సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ జెనిసిస్ట్ డాక్టర్ రాబర్ట్, హనుమంతరావు, చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

హిమాయత్ నగర్, ఫిబ్రవరి12: రాష్ట్రంలోని మాదిగ సామాజిక వర్గంపై ప్రభుత్వం వివక్ష చూపించడం తగదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్ పీ ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేశ్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి గాడేపగ అమరేందర్ మాదిగ హెచ్చరించారు. బుధవారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై దాడులు, అక్రమంగా కేసులు నమోదు కావడం పెరిగి పోతున్నాయని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీర్ అత్తర్ ఇచ్చిన రిపోర్టును రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని, ఈ నివేదికలో ఉన్న లోపాలను సవరించి మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహం చేసుకున్న దళిత యువకుడు వడ్ల కొండ కృష్ణను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కృష్ణ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బలరాం, గ్రేటర్ కన్వీనర్ ఇంద్రాల శేఖర్, మాదిగ యువసేన గ్రేటర్ అధ్యక్షుడు దర్శనం రామస్వామి, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఇంద్రకంటి సూరి, ప్రజా సేవ సమితి చైర్మన్ లకదాసరి శ్రీనాథ్, నాయకుడు అనిల్ కుమార్ పాల్గొన్నారు.



**పోలీసులూ ఇటు చూడండి..**

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతమైన సెక్రటేరియట్ రోడ్డులో ఓ ద్విచక్ర వాహనదారుడు బైక్ రేసింగ్‌తో విన్యాసాలు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేశాడు. పోలీసులు అక్కడే ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

## విద్యారంగాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్



నిజాం కళాశాలలో నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో పాల్గొన్న పీడీఎస్‌యూ ఖైరతాబాద్ జోన్ అధ్యక్ష,కార్యదర్శులు అనిల్, పవన్ తదితరులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 12:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 14 నెలలు గడుస్తున్నప్పటికీ విద్యారంగానికి కనీసం ఓ ప్రత్యేక శాఖను నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేసి నియంత పాలనతో రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నాడని పీడీఎస్‌యూ ఖైరతాబాద్‌జోన్ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, పవన్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. బుధవారం బషీర్‌బాగ్ నిజాం కళాశాలలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయిందని, ఇలాంటి పట్టింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నదని వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఫిబ్రవరి 13నుంచి 15 వరకు రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశా రు. సమావేశంలో పీడీఎస్‌యూ నిజాం కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్ నవీన్ సాయి ప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అభిరామ్, గర్ల్స్ కన్వీనర్ సరస్వతి, ఖైరతాబాద్ జోన్ ఉపాధ్యక్షులు సాయి, సహాయ కార్యదర్శి సుమంత్, శివ, హరికృష్ణ, పవన్, అనిల్, నితిన్ పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో టీటీఏ దశాబ్ది ఉత్సవాలు

**టీటీఏ అధ్యక్షులు మలిపెద్ది నవీన్ రెడ్డి, ఇండియా కో ఆర్డినేటర్ డాక్టర్ ద్వారకానాథరెడ్డి**

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 12: తెలంగాణ, అమెరికా తెలుగు అసోసియేషన్(టీటీఏ)దశాబ్ది ఉత్సవాలు తెలంగాణ సంస్కృతులు, సంప్రదాయాల మేళవింపుగా డిసెంబర్‌లో నిర్వహిస్తున్నట్లు టీటీఏ అధ్యక్షులు మలిపెద్ది నవీన్‌రెడ్డి, ఇండియా కోఆర్డినేటర్ డాక్టర్ దువ్వూరు ద్వారకనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం విడిపోయిన తరువాత అమెరికాలో డాక్టర్ పైళ్ళ మల్లారెడ్డి నాయకత్వాన ఏర్పాటైన టీటీఏ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని, సంప్రదాయాలను, కళల్ని గౌరవిస్తూ, ఏ దేశంలో ఉన్నా వాటిని భావితరాలకు తీసుకెళ్లే విధంగా కృషి చేస్తుందన్నారు. ఈ సేవాడేస్‌లో తెలంగాణ సాంస్కృతిక వైభవానికి వన్నెలద్దెతున్న ఎందరో కళకారుల్ని, నటుల్ని, విభిన్న రంగాల్లోని నిపుణులను, శాస్త్రవేత్తలను, వ్యాపారవేత్తలను సగౌరవంగా హైదరాబాదు వేదికగా సన్మానించనున్నారు. అలాగే 2026 మే` జూన్ నెలల్లో అమెరికాలో టీటీఏ దశాబ్దా ఉత్సవాల కన్వెన్షన్‌ను నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ కల్చర్‌ను ప్రభావితం చేసే అనేక మందిని అమెరికాలో జరిగే కన్వెన్షన్‌లో కూడా సత్కరించడం జరుగుతుందన్నారు.

**జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో**

## తెలంగాణకు కాంస్యం

మెహిదీపట్నం, ఫిబ్రవరి 12: ఉత్తరప్రదేశ్ హరిద్వార్ రోషనాబాద్‌లో 32వ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన నిఖిల్ యాదవ్ కాంస్య పతకం గెలిచాడు. 65కేజీల విభాగంలో కర్ణాటకకు చెందిన మహేశ్‌పై విజయం సాధించాడు. తెలంగాణ నుంచి జాతీయ స్థాయి పోటీల్లో పతకం గెలిచిన మొదటి కుస్తీ వీరుడిగా నిఖిల్ యాదవ్ రికార్డు సృష్టించాడు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ తరపున కుస్తీ పోటీల్లో నిఖిల్ యాదవ్ పాల్గొన్నారు. కాంస్య పతకం గెలిచిన సాట్ కోచ్ నర్సింగ్‌రావు, మరో కోచ్ సయ్యద్ యాసీన్‌లు అభినందించారు.

## హక్కుల సాధనకు ఆర్టీసీ సమ్మె తప్పదు

సైదాబాద్ ఫిబ్రవరి 12:ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెను ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వెంకన్న అన్నారు. బుధవారం విధాని ఆర్టీసీ డిపో వద్ద జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నప్పటికీ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఆ దిశగా ఏ చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు ప్రైవేట్‌పరం చేయడానికి కుట్రలు చేస్తుందని విమర్శించారు. అదేవిధంగా రిటైర్డ్ అయిన ఆర్టీసీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించలేడంలేదని, కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదన్నారు. ఆర్టీసీ ఎండీ సంస్థ లాభాల్లో కొనసాగుతుందని చెప్పినప్పటికీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటంటని ఆయన ప్రశ్నించారు. ఆర్టీసీ పరిరక్షణకు మరో ఉద్యమం చేయాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించి సమ్మెకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కొలకలూరి సాహిత్య పురస్కారాలు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 12: 2025కు గాను ఆచార్య కొలకలూరి సాహిత్య పురస్కారాలకు ఎంపికైన గ్రంథాలను బుధవారం కమిటీ ప్రకటించింది. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారానికి ప్రముఖ కవి జూకంటి జగన్నాథం రచించిన ఒక కప్పుచాయ్–నాలుగుమెసేజ్‌లు, నాటక విభాగంలో కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారానికి నాటకకర్త డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య నాటకీకరణ చేసిన స్వర్గాదపి గరీయసీ, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారానికి పరిశోధకుడు డాక్టర్ గడ్డం మోహన్‌రావు గ్రంథం చిందోళ్ల చరిత్ర, సంస్కృతి–సాహిత్యం పురస్కారాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. పురస్కారం కింద ఒక్కొక్కరికీ రూ.15వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నట్లు తెలిపారు. ఈనెల 26న నాంపల్లి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గల ఆడిటోరియంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.